వైద్య రత్న అవార్డుకు డాక్టర్ శైలజ ఎంపిక



చార్మినార్: వైద్య రత్న అవార్డు–2025కు ప్రముఖ వైద్యురాలు డాక్టర్ డి. శైలజ ఎంపికైనట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు. హిమాయత్‌సాగర్‌లోని ఇంజినీరింగ్ రీసెర్చ్ లేబరేటరీస్‌లో సీనియర్ మెడికల్ ఆఫీసర్‌గా వైద్య సేవలు అందిస్తున్న శైలజకు ఈ ఏడాది జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్య రత్న అవార్డు–2025ను అందజేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య సమస్యలపై ఎన్నో ప్రసంగాలు, క్యాంపులు నిర్వహిస్తూ, ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో వివిధ రకాల రోగాల పరిష్కారాలపై ఎన్నో శిబిరాలు నిర్వహించారన్నారు.

లాల్‌దర్వాజా మహంకాళి అమ్మవారికి బోనం సమర్పణ



అమ్మవారికి బోనం సమర్పించిన తహసీల్దార్ షేక్ ఫర్వీన్

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారికి సంగారెడ్డి జిల్లా తహసీల్దార్ షేక్ ఫర్వీన్ గురువారం బోనం సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారీ ఆమెకు తీర్థప్రసాదాలు అందించారు. గతంలో స్థానిక బండ్లగూడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నప్పటి నుంచి ఆమె క్రమం తప్పకుండా అమ్మవారికి బోనం సమర్పిస్తున్నారు.

'ఎమర్జెన్సీ రోజులను ప్రజలు మరిచిపోరు'



మాట్లాడుతున్న ఉమామహేంద్ర

గన్‌ఫౌండ్రీ: కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీ ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని బీజేపీ ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. బీజేపీ గోల్కొండ జిల్లా నాయకుడు టి.ఉమామహేంద్ర ఆధ్వర్యంలో గురువారం గోషామహల్‌లోని కమ్యూనిటీ భవన్‌లో భారత ప్రజాస్వామ్యంలో చీకటి అధ్యాయానికి 50 ఏళ్లు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంపై నాటి పూర్వ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చేసిన దాడి ఎంతో దారుణమైందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్, రాష్ట్ర నాయకురాలు కె.మాధవి, జి.ఉమారాణి, గోవింద్‌రాఠి, వై.కృష్ణ, పాండు యాదవ్, కార్పొరేటర్లు రాకేష్ జైస్వాల్, సురేఖ ఓంప్రకాష్, శైలేందర్‌యాదవ్ పాల్గొన్నారు.


హైదరాబాద్ ఫుట్‌బాల్ దిగ్గజాలు స్ఫూర్తిదాయకం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ఫుట్‌బాల్ దిగ్గజాలు డీఎంకే అఫ్జల్, సయ్యద్ మహబూబ్ అలీ స్ఫూరిదాయకమని పలువురు కొనియాడారు. గురువారం నిజాం క్లబ్‌లో వారి జ్ఞాపకార్థం జరిగిన సంతాప సమావేశంలో పలువురు క్రీడాకారులు మట్లాడారు. ఇరువురు భారత ఫుట్‌బాల్‌కు నిజమైన హీరోలని, వారి అంకితభావం స్ఫూర్తిదాయకమన్నారు. హైదరాబాద్ ఫుట్‌బాల్‌ను పూర్వ వైభవానికి పునరుద్ధరించడానికి కృషి అవసరమని పలువురు అభిప్రాయపడ్డారు ఈ కార్యక్రమంలో భారత ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ విక్టర్ అమల్‌రాజ్, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి జి.పి. పాల్గుణ, జి.పి. విజయకుమార్, హబీబ్ ఖాన్, నూర్, ఇలియాస్, గౌస్,కుమార్, చంద్రశేఖర్, ఇలియాస్, సయ్యద్ హసన్ రజా, వెంకట్‌రెడ్డి, సయ్యద్ అబేది, ఖాన్, పీర్ బాషా, బాబా, ఆరిఫ్, సయ్యద్ అహ్మద్ జియావుద్దీన్ పాల్గొన్నారు.

మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులు చేపట్టాలి

అబిడ్స్: పెండింగ్‌లో ఉన్న చుడిబజార్ రామ్‌మనోహర్ లోహియా మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులను వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ ఆదేశించారు. గురువారం గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ కమిషనర్‌ను కలిసి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కమిషనర్‌కు ఇచ్చిన వినతి పత్రాన్ని అందజేసి సమస్యలు వివరించారు. 9 ఏళ్ల క్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులు రెండేళ్ల క్రితం పూర్తి కాకుండానే ఇంజినీరింగ్ అధికారులు నిలిపివేశారని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ..వెంటనే ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులను పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎందుకు ఆగిపోయిందో విచారణ జరపాలన్నారు. సుమన్ కుమార్, యాదగిరి, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు సమస్య వివరిస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

బోనం..ఘనం









గోల్కొండ బోనాల జాతరలో ఆనంద్ గురువు



బోనాల ఊరేగింపులో మాజీ ఎంపీ వి.హనుమంతరావు

మొదలైన బోనాల జాతర
- అంబరాన్నంటిన సంబరాలు
- గోల్కొండ కోట ఎల్లమ్మకు మొదటి బోనం పూజ
- కోటలో ఆధ్యాత్మిక వాతావరణం



బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్సీ విజయశాంతి



అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ ఈటల రాజేందర్



కుమ్మరి సంఘం వారి బోనాల సమర్పణలో శ్రీకాంత్‌చారి తదితరులు



నృత్యం చేస్తున్న ఆలయ చైర్మన్ చంటిబాబు, దళితరత్న రాజావస్వాద్

గోల్కొండ: అమ్మ బైలెల్లినాదో..అనే భక్తి గీతాలతో గోల్కొండ కోట పరిసరాలు దద్దరిల్లాయి. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు పురస్కరించుకొని గురువారం జగదాంబిక మహంకాళి అమ్మవారి మొదటి బోనం పూజ ఘనంగా జరిగింది. గోల్కొండకు ఉన్న మార్గాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పోతరాజుల విన్యాసాలను చూడడానికి భక్తులు తరలివచ్చారు. డప్పు వాయిద్యాల నడుమ పోతరాజులు ఓ చేతిలో కొరడా పట్టుకొని అందరిని అబ్బురపరిచారు. యువకులు నృత్యాలు చేస్తూ పోతరాజులను ఉత్సాహ పరిచారు. మరో వైపు సంస్కృతిక కళా జాతర బృందాల నృత్యరూపకాలు సైతం అందరినీ ఆకట్టుకున్నాయి.

అమ్మవారి దర్శనానికి బారులు..

ఉదయం నుంచే భక్తులు గోల్కొండ కోటకు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ విజయశాంతి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఈటల రాజేందర్ రిసాలబజార్‌లోని బి.శ్రీకాంత్‌చారి మొదటి జులూస్‌కు హాజరయ్యారు. రాష్ట్ర కుమ్మరి సంఘం వారు 111 కుండలను అమ్మవారికి సమర్పించారు. తూమ్‌కుంట అరుణ్‌కుమార్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు అమ్మవారి దర్శనం చేసుకున్న వారిలో ఉన్నారు.

లంగర్‌హౌస్‌లో..

లంగర్‌హౌస్: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు గురువారం ప్రారంభం అయ్యాయి. ఇందులో భాగంగా మంత్రులు లంగర్‌హౌస్‌లో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొండెపూడి చంటిబాబు ఆధ్వర్యంలో కనుల పండువగా ఊరేగింపు చోటాబజార్‌కు చేరుకుంది. అక్కడ ప్రధాన పూజారి సర్వేష్ చారి ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తులు, అమ్మవారి నగలను పల్లకీలో ఊరేగింపుగా గోల్కొండ కోటపై అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లారు. దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, బోనాల వేడుకల ప్రత్యేక అధికారి వినోద్ రెడ్డి, ఈఓ వసంత భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసి ఉత్సవాలు నిర్వహించారు.



పూజారి ఇంటి నుంచి అమ్మవారి ఉత్సవ మూర్తులు, నగలు, పల్లకీ సేవ ప్రారంభం



మాదకద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

విజయనగర్‌కాలనీ: మాదకద్రవ్యాల వినియోగం విద్యార్థుల భవిష్యత్తులను నాశనం చేస్తుందని ఇన్‌స్పెక్టర్ కె.నారాయణరెడ్డి అన్నారు. గురువారం మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలో విద్యార్థులకు మాదకద్రవ్య నిరోధక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మాదకద్రవ్యాలు మత్తుపదార్థాల వినియోగం వల్ల విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో అనే విషయాలను వివరించారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ..మాదకద్రవ్యాలను ప్రోత్సహించే స్నేహితులను దూరంగా ఉంచాలని విద్యార్థులకు సూచించారు. ఆర్కిటెక్చర్ విభాగాధిపతి చిన్న సైదులు, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ మణుస్వామినాధన్, యూనివర్సిటీ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

క్రీడా రిజర్వేషన్ జీఓ 74ను సవరించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కృష్ణమూర్తి గౌడ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు న్యాయం జరిగేలా క్రీడా రిజర్వేషన్ జీఓ 74ను సవరించాలని వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం (పెటా టీఎస్) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గురువారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నగాని కృష్ణమూర్తి గౌడ్ ఆధ్వర్యంలో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్రీడా రిజర్వేషన్ జీఓ 74 ప్రకారం క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫారం 1–4 ను తొలగించి అదే స్థానంలో 1–90 ప్రాధాన్యతాక్రమాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కట్టా శ్రీనివాస్, నల్గొండ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, పీఈటీలు ప్రకాష్, రాజేందర్, విక్రమ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల శ్రేయస్సుకు టీఎన్జీఓస్ సెంట్రల్ ఫోరం కృషి



ఆర్‌జేడీ విజయలక్ష్మిని సన్మానిస్తున్న రాజ్‌కుమార్, భాస్కర్

అబిడ్స్: ఉద్యోగుల శ్రేయస్సుకు టీఎన్జీఓస్ సెంట్రల్ ఫోరం కృషి చేస్తుందని టీఎన్జీఓస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.భాస్కర్ పేర్కొన్నారు. విద్యాశాఖ ఆర్‌జేడీ విజయలక్ష్మి గురువారం విద్యాశాఖలోని పలువురు ఉద్యోగులకు పదోన్నతి కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్, భాస్కర్ ఆమెను ఘనంగా సత్కరించి విద్యాశాఖ ఫోరం తరపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ..విజయలక్ష్మి విద్యాశాఖలోని ఎన్నోరోజులుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలన్ని అంచెలంచెలుగా పరిష్కరిస్తున్నారని కొనియాడారు. విజయలక్ష్మి మాట్లాడుతూ..ఉద్యోగులకు అండగా ఉండి వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఫోరం నాయకులు రవి, శ్రీరుగేష్, జయంతిరెడ్డి, ఇషాక్‌ఖాన్, ఫెరస్, అహ్మద్, సిరి ప్రియ, రామేశ్వరీ, శ్రీనివాస్‌బాబు, అరుణ, జ్యోతి పాల్గొన్నారు.

మొహర్రానికి బందోబస్తు ఏర్పాటు చేయాలి



సీపీకి వినతిపత్రం అందజేస్తున్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, అల్కా మనోజ్

చార్మినార్: మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకుని అన్ని ఆషుర్‌ఖానాల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ నగర పోలీస్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు రాష్ట్ర మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షురాలు అల్కా మనోజ్‌తో కలిసి ఆయన నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌ను కలిసి కోరారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అధికారికంగా రాసిచ్చిన లెటర్‌ను వారు సీపీకి అందజేశారు. పదో మొహర్రం సందర్భంగా డబీర్‌పురాలోని బీబీకా ఆలం సామూహిక ఊరేగింపు కొనసాగనుందని..ఇందుకోసం తగిన ఏర్పాట్లతో పాటు భారీ బందోబస్తు కొనసాగించాలని ఆయన కమిషనర్‌ను కోరారు.

పేదలను ఆదుకోవాలి



సమావేశంలో ప్రతినిధులు

చార్మినార్: మాదిగ సామాజిక వర్గానికి చెందిన పేదలను ఆదుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జి వెంకట స్వామి మాదిగ అన్నారు. పురానాపూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..ఏళ్ల తరబడి మురికివాడల్లో నివసిస్తున్న మాదిగ సామాజిక వర్గానికి చెందిన పేదలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీ.వీ.నరసింహ రావు, సుజాత మాదిగ, ఎస్.ఎం. నరసింహ స్వామి మాదిగ, నర్సింగ్ రావు మాదిగ, యాదగిరి మాదిగ, సదానందం మాదిగ పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి విషయాన్ని సీబీఐకి అప్పగించాలి

గన్‌ఫౌండ్రీ: కాళేశ్వరం ప్రాజెక్ట్ జరిగిన అవినీతిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధారాలతో సహా బయటపెట్టగానే బీఆర్‌ఎస్ నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌పై బీఆర్‌ఎస్ నేతల వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ముమ్మాటికీ అవినీతి ప్రాజెక్టే అని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మాటలే తమ స్టాండ్ అని ప్రకటించారు. రూ.38 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును రూ.1.20 లక్షల కోట్లకు పెంచలేదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రస్తుతం జరుగుతున్న విచారణ నత్తనడకలా ఉందని వెంటనే సీబీఐకి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని యెడలా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు ఒక్కటే అనుకోవాల్సి వస్తుందన్నారు.


విద్యార్థిని అదృశ్యం



సౌమ్య

అబిడ్స్: విద్యార్థిని అదృశ్యమైన ఘటన బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా యాప్రాల్‌కు చెందిన వి.సౌమ్య (21) నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని కళాశాలలో డిగ్రీ చదువుతుంది. కళాశాల సమీపంలోని ఒక హాస్టల్‌లో ఉంటుంది. ఈ నెల 15న ఆమె తల్లికి ఫోన్‌చేసి మూడు రోజుల్లో ఇంటికి వస్తానని వివరించింది. తిరిగి ఇంత వరకు ఇంటికి వెళ్లకపోవడంతో ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలించారు. ఫోన్ స్విచ్చాఫ్ ఉండడంతో పాటు కళాశాలలో కానీ, హాస్టల్‌లో కానీ ఆచూకి లభించకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు గురువారం బేగంబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు ఆమె ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ మహంకాళి ఆలయంలో 76వ వార్షిక బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జనగామ మధుసూదన్ గౌడ్, కీర్తి నరేందర్ ముదిరాజ్ తెలిపారు. ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జూలై 11 నుంచి 21వ తేదీ వరకు ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు. 20న అమ్మవారికి సమర్పించే బోనాల ఉత్సవానికి పెద్ద ఎత్తున మంత్రులు, రాజకీయ ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు. కమిటీ ప్రతినిధులు రుద్రారం శ్రీనివాస్, బత్తుల నరేష్, గురునాథ్, ఆనంద్, హరికృష్ణ, బంటి తదితరులు పాల్గొన్నారు.

నూతన కోర్సుల ఏర్పాటుకు చర్యలు



వేణుగోపాల్ రావు

యాకుత్‌పురా: మార్కెట్‌కు అనుగుణంగా నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తామని సెట్విన్ శిక్షణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కే.వేణుగోపాల్ రావు అన్నారు. పురానీహవేలీలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ..నిరుద్యోగులకు అవసరమైన ఉపాధి, ఉద్యోగావకాశాలకు సంబంధించిన కోర్సులను ప్రవేశ పెట్టేందుకు సంస్థ చైర్మన్ గిరిధర్‌రెడ్డి సారథ్యంలో శిక్షణ కేంద్రాలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల హుస్నాబాద్, నల్గొండ, మహబుబ్‌నగర్, జహీరాబాద్, బోడుప్పల్ ప్రాంతాల్లో నూతన శిక్షణ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. త్వరలో జడ్చర్ల, గోషామహల్ ధూల్‌పేట్ ప్రాంతాల్లో నూతన శిక్షణ కేంద్రాలను ప్రారంభించనున్నమని తెలిపారు. గత ఏడాది 16 వేల మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వగా ఈ విద్యా సంవత్సరం 2025–26కి గాను ఇప్పటి వరకు 5073 మంది అడ్మిషన్లు పొందరన్నారు. ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందేందుకు స్థానిక శిక్షణ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గోల్కొండ ఆసుపత్రి అభివృద్ధికి కృషి



గోల్కొండ ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రికి అవసరమైన పరికరాలతో పాటు వైద్యులు, వైద్య సిబ్బందిని నియమిస్తామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన అన్నారు. గురువారం ఆమె గోల్కొండ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు గణనీయంగా బాగుపడిందని అన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రి నగరంలోని ఏరియా ఆసుపత్రుల్లో ప్రముఖమైనదని ఆయన అన్నారు. వేలాది మంది ఔట్‌పేషంట్లు వచ్చే ఈ ఆసుపత్రికి వైద్య పరికరాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కాగా నూతన భవన నిర్మాణానికి నాలుగున్నర కోట్లు, వైద్య పరికరాల కొనుగోలుకు 1.30 కోట్లు మంజూరయ్యాయని, అయితే ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదని ఆసుపత్రి మెడికల్ సూపరింటెంటెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాస్‌రావు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు విడుదల చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటి, ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ మురళీధర్, ఆర్‌ఎంఓ డాక్టర్ అమీనా అఫ్జా తదితరులున్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

గోల్కొండ: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ అన్నారు. గురువారం మెహిదీపట్నంలోని జి.పుల్లారెడ్డి కళాశాలలో యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమం జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. డ్రగ్స్ రవాణా, వినియోగం తదితర వాటిపై తాము ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. పోలీసులు అత్యాధునిక టెక్నాలజీ సహాయంతో డ్రగ్స్ సరఫరా చేసే ముఠాల ఆటలను సాగనివ్వడం లేదని ఆయన అన్నారు. ఇందులో భాగంగానే నగరంలో వివిధ పనుల కారణంగా ఉంటున్న విదేశీయులను కూడా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మహ్మద్ మునావర్, గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ రాజుతో పాటు జి.పుల్లారెడ్డి డిగ్రీ, ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్

పట్టు వస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలు అందజేస్తున్న మల్యాల మధుసూదన్ యాదవ్, సునీత దంపతులు

చార్మినార్: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు మల్యాల మధుసూదన్ యాదవ్, సునీత దంపతులు కొమురవెల్లి మల్లికార్జున స్వామితో పాటు అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించి వచ్చినట్లు గురువారం తెలిపారు. రెండు వారాలుగా ఆలయం ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ వీటిని తయారు చేయించి కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం ఈఓ అన్నపూర్ణ, అడిషనల్ ఈఓ శ్రీనివాస్ సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సమర్పించామన్నారు.

'కాకోటి' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న భట్టి విక్రమార్క

సుల్తాన్‌బజార్: బంజారాల అస్తిత్వాన్ని అక్షరాలుగా మలచిన గ్రంథం 'కాకోటి' అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. వీరశాలి దాకి బంజారా మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ రచించిన సాహిత్య సంపుటి బొడ్డు వివ్యాల గుచ్ఛం కాకోటి అనే గ్రంథాన్ని గురువారం ఈ ఉప ముఖ్యమంత్రి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ తాను అభిమానించే బంజారా సాహిత్యాన్ని వదిలిపెట్టకుండా ఈ కాకోటి అనే గ్రంథాన్ని రాయడం ఎంతో అభినందనీయమన్నారు. సూర్య ధనుంజయ్ మాట్లాడుతూ..తాను పుట్టిన జాతికి సేవ నిరతితో ఈ గ్రంథాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని దృఢ సంకల్పంతో తీసుకువచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరామ్ నాయక్, హైకోర్టు అడ్వకేట్ డాక్టర్ ధనుంజయ నాయక్, డాక్టర్ రమేష్, మందిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత, రమేష్ కార్తీక్ నాయక్, సీతల్ చౌహాన్, డాక్టర్ మంత్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.